సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 16 । జూలై । 2025



బీడీ కార్మికుల పిల్లలకు 'ఉపకార'ం

బీడీ కార్మికుల పిల్లలు చదువులో రాణించేలా కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ చేయూతనిస్తోంది. ఒకటో తరగతి నుంచి ప్రొఫెషనల్ కోర్సుల వరకు అండగా నిలుస్తోంది. 10లో▸



గావ్‌షాత్ పూజలు

ఇంద్రవెల్లి మండలం పొల్లుగూడలో గావ్ షాత్ పూజలు ఘనంగా నిర్వహించారు. జొచ్చమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా 'మల్లెపూల'



మల్లెపూల నర్సయ్య

ఆదిలాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లెపూల నర్సయ్య నియామకమయ్యారు. అయితే అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. కాగా, ఏడాదిగా గ్రంథాలయ సంస్థకు చైర్మన్ లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న లైబ్రరీల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. సరైన పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, మౌలిక సదుపాయాలు లేక పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు ఇక్కట్లు పడుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులతో పాటు సలహాలు, సూచనలు చేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 99592 26002 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'వారిపై చర్యలు తీసుకోండి'

ఆదిలాబాద్: నిబంధనలకు విరుద్ధంగా క్రికెట్ శిక్షణ ఇస్తున్న వారిపై తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. నరోత్తంరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా హెచ్‌సీఏ పేరిట వస్తున్న నిధులు దుర్వినియోగం చేస్తూ చిన్నారుల నుంచి సైతం ఫీజులు తీసుకుంటూ నిర్వాహకులు మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వేసవి శిబిరాల పేరిట ఔత్సాహికులైన క్రీడాకారుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇటీవల హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలను బయట పెట్టిన సీఐడీ అధికారులు హెచ్‌సీఏ అధ్యక్షుడిని అరెస్టు చేసినట్లు వివరించారు. హెచ్‌సీఏ పేరిట ఎవరు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినా నమ్మవద్దని, ఈ విషయంలో ఇప్పటికే కలెక్టర్, ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్రం చేయూత



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ నగేశ్

బజార్‌హత్నూర్: మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఓఎన్జీసీ మంజూరు చేసిన 270 కుట్టుమిషన్లను 18 గ్రామాల మహిళలకు ఆ సంస్థ ప్రతినిధి మృత్యుంజయ్‌తో కలిసి పంపిణీ చేశారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదర్శ, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, జెడ్పీ పాఠశాల విద్యార్థులకు 50 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో రాణించాలన్నారు. అలాగే విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం డేడ్ర గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. డేడ్ర, గిరిజాయి, మాన్కపూర్, బద్దునాయక్ తండా, ఇంద్రనగర్, ఉమార్డ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు తాటిపల్లి రాజు, కొత్త శంకర్, నాయకులు గణేశ్, రమణ, సుఖ్‌దేవ్, మురళీమోహన్, గజానంద్, రాజేశ్వర్, ఎంఈవో కిషన్‌గుప్తా, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. కల్లు!

- తమ గ్రామంలో కల్తీ కల్లు విక్రయాలు నిషేధించాలని తలమడుగు మండలం ఖోడద్ గ్రామస్తులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా బాస్ ఆదేశాల మేరకు స్థానిక కల్లు విక్రయ కేంద్రాన్ని ఎక్సైజ్ సీఐ విజేందర్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. విక్రయిస్తున్న సరుకును ధ్వంసం చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. తయారీకి వినియోగించిన రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. షాపును సీజ్ చేశారు. ఇదొక్కటే కాదు.. జిల్లాలో చాలా చోట్ల కల్తీ కల్లు విక్రయాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎక్సైజ్‌స్టేషన్	టీఎఫ్‌టీ (వ్యక్తిగత)	టీసీఎస్ (సంఘాలవి..)
ఆదిలాబాద్	23	2
ఉట్నూర్	1(ఇంద్రవెల్లి)	-
ఇచ్చోడ	24	-

- రసాయనాలతో కృత్రిమంగా తయారీ
- తాగే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నిషేధించాలంటున్న జనం
- నామమాత్ర తనిఖీలకే 'ఎక్సైజ్' పరిమితం



రసాయనాలతో తయారు చేసిన కల్లును స్వాధీన పరుచుకున్న ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కొంత మంది కల్తీ కల్లు తయారు చేసి అమాయక ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. రసాయనాలు, ఇతర పదార్థాలు కలిపి అచ్చం ఈతకల్లులా తయారు చేస్తున్నారు. వీటిని తాగిన జనం అనారోగ్యం బారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంతో ఈ కల్తీ దందా యథేచ్ఛగా సాగుతుందనే ప్రచారం వినిపిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు సేవించి తొమ్మిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా ఆ శాఖ నామమాత్రపు తనిఖీలకే పరిమితమైందనే విమర్శలున్నాయి. కొరడా ఝుళిపించకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో వందల్లో ఈత చెట్లు ఉండగా.. ప్రతీరోజు 10వేల లీటర్లకు పైగా కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇక ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 5వేల లీటర్ల వరకు, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 8వేల లీటర్ల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే చెట్లు తక్కువగా ఉన్నప్పటికీ తయారయ్యే కల్లు అధికం. మొత్తంగా 5 శాతం కల్లు ఉంటే 95 శాతం రసాయనాలతోనే తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తయారీ ఇలా..

స్వల్పంగా సేకరించిన కల్లులో భారీగా నీటితో పాటు రసాయనాలు అధిక మోతాదులో కలుపుతున్నారు. ముఖ్యంగా క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం, డైజోఫామ్, ఓపీఎం ఇతర రసాయనాలను కలిపి కృత్రిమ కల్లు తయారు చేస్తున్నారు. వీటిని తాగిన వారు మత్తులో తూగుతున్నారు. పులుపు కోసం లెమన్ సాల్ట్, తీపి కోసం షాక్రిన్, పులియబెట్టడానికి డైయిస్ట్ పౌడర్, తెలుపు కోసం టైటానియం డయాక్సైడ్, నురుగు కోసం కుంకుడుకాయ ఇతర రసాయనాలు కలుపుతున్నారు. ఇది అచ్చం ఈత, తాటికల్లు లాగానే కనిపిస్తోంది. కానీ ఇందులో ఒక శాతం కూడా వాటి ఆనవాళ్లు ఉండడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు..

కల్తీ కల్లు ప్రాణాలు తీస్తుందని తెలిసినా.. చాలా మంది దానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తక్కువ ధరకే దొరుకుతుండటంతో తాగి అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. చెట్ల నుంచి వచ్చే కల్లులో రసాయనాలు, నీళ్లు, ఇతర పదార్థాలు కలిపి భారీ మొత్తంలో తయారు చేసి కాంపౌండ్‌లలో విక్రయిస్తున్నారు. వీటిని తాగిన వారి శరీర అవయవాలు పనిచేయకుండా పోయి ప్రాణాంతకంగా మారుతోంది. క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్ వంటివి అధిక మోతాదులో కలపడంతో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. శ్వాస తగ్గిపోవడం, బీపీ తగ్గడం, కోమాలోకి వెళ్లడం, మరణం సంభవిస్తుంది. కాలేయం, కిడ్నీలపైనా వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

తనిఖీలు చేపడుతున్నాం..

కల్తీ కల్లు తయారు చేయకుండా తనిఖీలు చేపడుతున్నాం. అనుమతి లేని షాపులపై కేసులు నమోదు చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– విజేందర్, ఎక్సైజ్ సీఐ, ఆదిలాబాద్

నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం



కల్తీ కల్లు తాగే వారి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. క్లోరోహైడ్రేట్, ఆల్ప్రజోలమ్, డైజోఫామ్ తదితర రసాయనాలతో తయారు చేసిన కల్లు తీవ్రమైన మత్తు, బద్ధకం, వివిధ అనారోగ్యానికి దారి తీస్తుంది. ఫిట్స్, మూత్ర పిండాలు చెడిపోవడం, గుండె, నరాల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ.

– ఆడే విఠల్, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

భూసారం ఆధారంగా ఎరువులు వాడాలి

- కలెక్టర్ రాజర్షిషా



భూసార కార్డు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్: రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు మట్టి నమూనా పరీక్ష ఫలితాల పత్రాలు పంపిణీ చేశారు. మోతాదు మేరకే ఎరువులు వాడాలని సూచించారు. లేకుంటే నేల భూసారం కోల్పోయి పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం తాడిహత్నూర్ శివారులో ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. నార్నూర్‌ను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్యానశాఖ కృషి చేస్తుందన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్వశోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని సందర్శించారు. నిర్వాహకులను అభినందించారు. వన మహోత్సవంలో భాగంగా స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించారు. ఆయన వెంట డీఈవో శ్రీనివాస్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో గంగాసింగ్, సీడీపీవో శారద, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంఈవో అనిత, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఏవో ఆకాశ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో విద్య, వైద్యం మెరుగుపరచాలి

ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు కోరారు. మండల పర్యటనకు విచ్చేసిన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్ రావు, మండల అధ్యక్షుడు శ్రీరామ్ తదితరులున్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు!

- ఆటవిడుపుగా ఆదిలాబాద్ డీఏవో పోస్టు
- జిల్లాలో పనిచేసేందుకు అధికారుల అయిష్టత
- బదిలీపై వచ్చిన ఆఫీసర్ నామమాత్రంగా చేరిక
- అదే రోజు నిజామాబాద్‌కు డిప్యూటేషన్‌పై..
- మళ్లీ ఇన్‌చార్జి పాలనే..



జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం



నిజామాబాద్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న గోవింద్

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా వ్యవసాయ అధికారిగా బదిలీపై వచ్చిన మేకల గోవింద్ మంగళవారం ఉదయం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.. తర్వాత కొంత మంది వ్యవసాయ అధికారులు వచ్చి ఆయనను కలిశారు. పిమ్మటే ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయి నిజామాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీధర్‌స్వామి మళ్లీ తన పోస్టులో యథావిధిగా ఒదిగిపోయారు. వ్యవసాయ శాఖలో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. ఇదంతా ఒకే రోజులో జరిగిపోయింది.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖలో ప్రస్తుతం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చోటు చేసుకుంటుంది. ఇదిలా ఉంటే హైదరాబాద్ రైతు కమిషన్‌లో జేడీఏగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న గోవింద్‌ను ప్రభుత్వం ఆదిలాబాద్‌కు బదిలీ చేసింది. మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత నిజామాబాద్‌లో జేడీఏ పోస్టు ఖాళీగా ఉండగా, డిప్యూటేషన్‌పై అక్కడికి వెళ్లిపోయారు. అయితే ఆదిలాబాద్‌లో పనిచేసేందుకు అయిష్టత కారణంగా అనువైన జిల్లాకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చారని వ్యవసాయ శాఖలో చర్చించుకుంటున్నారు.

అంతా ప్రణాళిక..

రాష్ట్రంలోని పాత పది జిల్లాల్లోనే జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (జేడీఏ) పోస్టులు ఉన్నాయి. రైతు కమిషన్‌లో జేడీఏ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న గోవింద్ బదిలీ తప్పని పరిస్థితుల్లో ఆదిలాబాద్‌కు అదే హోదాలో వచ్చారు. అయితే ఇక్కడి నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లేందుకు ముందే ఆయన వ్యూహరచన చేసుకున్నారనే ప్రచారం ఉంది. ప్రభుత్వం నుంచి బదిలీల ప్రక్రియ చోటుచేసుకోగా, అక్కడి నుంచి ఆయనను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. నిజామాబాద్‌లో ఏడీఏ వీరస్వామి ఇన్‌చార్జి డీఏవోగా వ్యవహరిస్తున్నారు. జేడీఏ హోదా ఉన్న స్థానానికే అధికారి గోవింద్ వెళ్లాల్సి ఉంటుంది. ఇదివరకు నిజామాబాద్ జిల్లాలో బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఈ ఆఫీసర్‌కు ఉంది. అక్కడ కూడా జేడీఏ హోదా కలిగి ఉండడంతో వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఆయన ఆదిలాబాద్‌లో ఇలా బాధ్యతలు తీసుకొని.. ఆ వెంటనే అక్కడికి చేరుకున్నారు. అక్కడ కూడా అదే రోజు బాధ్యతలు తీసుకోవడం గమనార్హం. అయితేఈ విషయాలను ఆశాఖ అధికారులు ఎవరు కూడా బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. 'సాక్షి'కి ఈ సమాచారం అందడంతో అటు నిజామాబాద్.. ఇటు ఆదిలాబాద్‌లో వివరాలు సేకరించడంతో ఈ రెండు జిల్లాల్లో మంగళవారం జరిగిన పరిణామాలు వెలుగులోకి వచ్చాయి.

ఇక్కడికి వచ్చే అధికారుల తంతే అంతా..

జిల్లాలో జేడీఏ పోస్టు ఓ ఆటవిడుపుగా మారిపోయింది. బదిలీలు, పదోన్నతులు వంటి ప్రక్రియలు చోటుచేసుకున్నప్పుడు తప్పని పరిస్థితిలో ఇక్కడికి వచ్చి ఏదో నామమాత్రంగా బాధ్యతలు స్వీకరించి ఆ తర్వాత డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడం తంతుగా మారిపోయింది. గతంలో ఉషాదయాల్‌ను ఇక్కడ నియమించగా ఆమె ఇక్కడి నుంచి డిప్యూటేషన్‌పై రంగారెడ్డి కమిషనర్ కార్యాలయానికి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఏడీఏ స్థాయి అధికారులు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూనే వస్తున్నారు. తాజాగా అదే పరిస్థితి. ఈ అధికారి కంటే ముందు కూడా మరో ఇద్దరు అధికారులను ఈ పోస్టులో నియమించగా వారు కూడా ఇక్కడ పనిచేసేందుకు అనాసక్తి కనబర్చుతూ డిప్యూటేషన్లపై వెళ్లిపోయారు. రెగ్యులర్ అధికారులు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోవడం, ఇక్కడ ఇన్‌చార్జి అధికారులే బాధ్యతలు నిర్వర్తిస్తుండడం ఓ ఫార్స్‌గా మారిపోయింది. బదిలీలు, పదోన్నతుల విషయమై ప్రస్తుతం ఇన్‌చార్జి జిల్లా అధికారిగా ఉన్న శ్రీధర్ స్వామిని 'సాక్షి' వివరణ కోరగా.. ఆయన ప్రస్తుతం అన్ని పోస్టులు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు.

అజ్ఞాతం వీడుతున్నారు..!

- జనంలోకి మావోయిస్టులు
- ఉమ్మడి జిల్లా నేతల లొంగుబాటు
- ఆపరేషన్ కగార్‌తో పంథా మారిన వైనం



లొంగిపోయిన మావోయిస్టులు ఆత్రం లచ్చన్న, అంకుబాయి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టినప్పటి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించడమో.. లొంగిపోవడమో జరుగుతోంది. ఇప్పటికీ కొందరు దశాబ్దాలుగా కుటుంబసభ్యులు, సొంతూరు విడిచి అడవుల్లోనే గడుపుతున్నారు. రోజు రోజుకు పోలీసు బలగాలు అడవులు, మావోయిస్టు కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు ఒక్కొక్కరుగా ఉద్యమానికి దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసులు కోరుతున్నారు. తాజాగా మావోయిస్టు దంపతులు అజ్ఞాతంవీడగా.. ఊరిలో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

ఉనికిని కోల్పోతున్న పార్టీ

నిత్యం పోలీసుబలగాలు, మావోయిస్టుల మధ్య ఘర్షణ నుంచి నేడు పార్టీ ఉనికే లేకుండాపోయే రోజులొచ్చాయి. గడచిన ఏడాదిలోనే పార్టీ వేగంగా క్షీణిస్తోంది. కేంద్ర కమిటీలో పని చేసిన కటకం సుదర్శన్ ఉరఫ్ ఆనంద్(69) మొదలు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, గడ్చిరోలీ జిల్లా ఇన్‌చార్జి కాసర్ల రవి ఉరఫ్ అశోక్, కంతి లింగవ్వతోపాటు అనేక మంది సీనియర్లను పార్టీ కోల్పోయింది. 2020లో కాగజ్‌నగర్ మండలం కడంబా ఎన్‌కౌంటర్‌లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్కాలు, నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన బాదీరావు చనిపోయారు. గతనెల 6న రాష్ట్ర కమిటీ సభ్యుడు, కేబీఎం కమిటీ ఇన్‌చార్జి మైలరాపు అడెలు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవుల్లో జరిగిన కాల్పుల్లో మరణించారు. ఆయనపై రూ.45లక్షల రివార్డు ఉంది.

మిగిలిందెందరు?

గతంలో అనేకమంది ఉమ్మడి జిల్లా నుంచి వివిధ రాష్ట్రాల్లో పలు హోదాల్లో పని చేసేవారు. ప్రస్తుతం వారి సంఖ్య పదిలోపే చేరింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు కీలక హోదాల్లో ఉన్నారు. నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచన్‌పల్లికి చెందిన ఇర్రి మోహన్‌రెడ్డి, సెంట్రల్ పొలిట్ బ్యూరో కేంద్ర కమిటీలో సాంకేతిక విభాగంలో ఉన్నారు. మరో ముఖ్యనేత మందమర్రికి చెందిన బండి ప్రకాశ్ ఉరఫ్ దాదా సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ చూస్తున్నారు. ఈయనను కేంద్ర కమిటీలోకి తీసుకున్నట్లుగా సమాచారం. అలాగే ఈయన సహచరులుగా ఉన్న పుల్లూరి ప్రసాదరావు ఎన్‌కౌంటర్‌లో మరణించారు. సలాకుల సరోజ, జాడి వెంకటి, పుష్పలత ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు.

దళంలోనే ఒక్కటై..

తాజాగా లొంగిపోయిన మావోయిస్టులు లచ్చన్న, అంకుబాయి అప్పట్లో క్రియాశీలకంగా ఉన్న సిర్పూర్ దళంలోనే పని చేస్తూ ఒక్కటయ్యారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పార్‌పల్లికి చెందిన లచ్చన్న 1983లో పీపుల్స్‌వార్ గ్రూప్ చెన్నూరు దళంలో చేరారు. 2002లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2007లో నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ సాంకేతిక విభాగం ఇన్చార్జిగా పని చేశారు. 2023నుంచి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నారు. ఈయనపై పలు పోలీసుస్టేషన్లలో 35కేసులు ఉన్నాయి.

అన్న వచ్చిన 37ఏళ్లకు..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడకు చెందిన చౌదరి అంకుబాయి 1988లో తన అన్న చిన్నన్నను కలిసేందుకు వచ్చి పార్టీలోకి వెళ్లింది. పీపుల్స్‌వార్ సిర్పూర్ దళ సభ్యురాలిగా చేరి, ఆ సమయంలోనే ఆత్రం లచ్చన్నను పెళ్లి చేసుకుంది. 1995లో లచ్చన్నతో పట్టణ ప్రాంతానికి బదిలీ కాగా, 2002లో ఏరియా కమిటీ సభ్యురాలిగా, తర్వాత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సాంకేతిక విభాగానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ టెక్నికల్ విభాగం సభ్యురాలిగా ఉన్నారు. ఈమెపై 14కేసులు ఉన్నాయి. అయితే అన్న కోసం అడవికి వెళ్లిన అంకుబాయి చిన్నన్న కొన్నేళ్ల క్రితమే లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతున్నారు. చెల్లె మాత్రం గత 37ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండిపోయింది.

సర్దుబాటు గందరగోళం

- ఇష్టారీతిన టీచర్ల కేటాయింపు
- జిల్లాలో 142 మందికి సర్దుబాటు
- ఎంఈవోలు, ఉద్యోగుల తీరుపై విమర్శలు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటు గందరగోళంగా మారింది. సర్కారు బడుల్లో టీచర్ల కొరత అధిగమించేందుకు ఏటా విద్యాశాఖ ఏటా ఈ ప్రక్రియ చేపడుతోంది. గతంలో మాదిరిగా ఈసారి కూడా తప్పిదాలు పునరావృతం అయినట్లు ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. కొంత మంది ఉపాధ్యాయులు, విద్యాశాఖ ఉద్యోగుల తీరుతో టీచర్లతో పాటు విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. జూనియర్లను సర్దుబాటు చేయాల్సి ఉండగా, సీనియర్లను ఆయా పాఠశాలలకు కేటాయించడం, మండల పరిధిలో కాకుండా ఇతర మండలాలకు కేటాయించడం, ఉర్దూ మీడియం పాఠశాలలకు తెలుగు మీడియం టీచర్లను ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా సంఘాల నాయకులు పలువురు విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. పొరపాట్లు సవరించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

జిల్లాలో..

జిల్లాలో డీఈవో పరిధిలో 500 ప్రాథమిక, 119 ప్రాథమికోన్నత, 120 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 65వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మొత్తం 3,067 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 2,654 మంది పని చేస్తున్నారు. 413 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో జిల్లాలోని ఆయా పాఠశాలల్లో అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్న స్కూళ్ల నుంచి అవసరమున్న చోటుకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. కొంతమంది మండల విద్యాధికారులు నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వారితో మచ్చిక ఉన్న వారికి దగ్గరలో గానీ, అదే పాఠశాలలో కొనసాగించడం, తదితరవి చేసినట్లు పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

142 మంది సర్దుబాటు..

సర్దుబాటు ప్రక్రియలో భాగంగా జిల్లాలో 142 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు చేశారు. ఇందుకు సంబంధించి డీఈవో ఉత్తర్వులుజారీ చేశారు. వీరిలో 96 మంది ఎస్జీటీలు, 46 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ ప్రక్రియతో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ప్రయోజనం చేకూరనుంది.

తప్పిదాలు ఇవే..

- జెడ్పీఎస్ఎస్ లాండసాంగ్విలో ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ పొందకముందే ఆ పాఠశాలకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల నుంచి అక్కడికి కేటాయించారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో ఇద్దరు సైన్స్ ఉపాధ్యాయులు పనిచేయాల్సిన పరిస్థితి. బోథ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు అవసరం ఉండగా అక్కడ పోస్టు కేటాయించలేదు.
- మావల మండలంలోని భట్టిసావర్గాం పాఠశాలలో జూనియర్ ఉపాధ్యాయుడిని అక్కడే కొనసాగించి సీనియర్‌ను సర్దుబాటు చేశారు. ఆయన వైకల్యం ఉన్నప్పటికీ అక్కడి నుంచి వేరే పాఠశాలకు కేటాయించారు.
- ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడిని జైనథ్ మండలంలోని ఆకుర్లకు కేటాయించగా, జూనియర్‌ను ఆదిలాబాద్‌లోని రాంపూర్‌కు కేటాయించారు.
- ఏజెన్సీ ప్రాంతానికి చెందిన 15 మంది ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి సర్దుబాటు చేశారు.
- ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరిలో పనిచేస్తున్న వైకల్యం గల టీచర్‌ను జైనథ్ మండలానికి సర్దుబాటు చేశారు. ప్రత్యేక కేటగిరీని కూడా పరిశీలించలేదు.
- బరంపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని భీంపూర్ మండలంలోని రాజులవాడికి కేటాయించారు. ఇటీవల ఆ ఉపాధ్యాయుడు తన కూతురును అదే పాఠశాలలో చేర్పించారు.
- భీంపూర్ మండలంలోని వడూర్ యూపీఎస్‌లో పనిచేస్తున్న ఎస్జీటీని మరో పాఠశాలకు సర్దుబాటు చేయాల్సి ఉండగా, స్కూల్ అసిస్టెంట్ సోషల్ బోధించేందుకు అదే పాఠశాలలో సర్దుబాటు చేశారు.
- బేలతో పాటు పలు ఉర్దూ మీడియం పాఠశాలల్లో తెలుగు మీడియం బోధించే ఎస్జీటీలతో సర్దుబాటు చేశారు. ఆ విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం చేకూరే పరిస్థితి లేదు.
- సిరికొండ, గాదిగూడ మండలాల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, ఈ రెండు మండలాలకు ఒక్క ఉపాధ్యాయుడిని కూడా సర్దుబాటు చేయకపోవడం గమనార్హం.

అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించాం

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలలకు అవసరానికి మించి ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను కేటాయించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం. ఏవైనా తప్పిదాలు ఉంటే సవరిస్తాం. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


భూమన్న (ఫైల్)

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు జిల్లా పద్మశాలి సంఘం సమన్వయకర్త, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ కోకన్వీనర్ ఆడెపు భూమన్న (61) సోమవారం రాత్రి బస్టాండ్ సమీపంలో కాలినడకతో రోడ్డు డివైడర్‌ను దాటే క్రమంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గల్ఫ్‌లో ఆగిన మరో గుండె

- పొన్కల్ వాసి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మామడ: కుటుంబ పోషణ, ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లిన వ్యక్తి అక్కడ గుండెపోటుతో మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ (46) ఆరునెలల క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. కంపెనీలో ఉద్యోగం లభించిందని కుటుంబ సభ్యులకు కొన్నిరోజుల క్రితం ఫోన్‌చేసి చెప్పడంతో సంతోషపడ్డారు. సోమవారం అబుదాబిలో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు తీరుతాయని అనుకుంటున్న సమయంలోనే మృత్యువు గుండెపోటు రూపంలో కబలించడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అబుదాబిలోని హెల్పింగ్ హాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పిచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


దేవిదాస్ (ఫైల్)

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన జాదవ్ దేవిదాస్ (42) సోమవారం మధ్యాహ్నం అదృశ్యం కాగా మంగళవారం మృతదేహం లభ్యమైనట్లు సీఐ బండారి రాజు తెలిపారు. కిరాణ దుకాణానికి వెళ్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి ఇంటికి రాకపోయేసరికి అతని భార్య వనిత ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మంగళవారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ ప్రహరీ పక్కన మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. పురుగుల మందు తాగినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఆరోగ్య పరిస్థితి సరిగాలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నమ్మకద్రోహం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షాపూర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ వద్ద రోహిత్ షిండే రూ.90వేలు తీసుకుని తన వద్ద ఉన్న కారును తాకట్టు పెట్టాడు. రెండు నెలల్లో తిరిగి ఇస్తానని ఇవ్వకపోవడంతో బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడికి తెలియకుండా మున్సిపాలిటీ వద్ద రోడ్డుపై ఉన్న వాహనాన్ని రోహిత్ షిండే తీసుకెళ్లి ఇతరులకు విక్రయించాడు. డబ్బులు అడిగితే తిరిగి ఇవ్వనని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇన్నిరోజులు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, తనకు న్యాయం చేయాలని బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు రోహిత్ షిండేపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

అంబులెన్స్ డ్రైవర్‌పై కేసు

మంచిర్యాలక్రైం: మద్యం సేవించి అంబులెన్స్ నడుపుతూ పట్టుబడిన ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో అంబులెన్స్ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపినట్లు పరీక్షల్లో తేలిందన్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

తెల్లకల్లు దుకాణంపై ఎక్సైజ్ దాడులు


దుకాణం సీజ్ చేస్తున్న అధికారులు

తలమడుగు: మండలంలోని ఖోడద్‌లో తెల్లకల్లు దుకాణంపై మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 80 లీటర్ల కల్తీ తెల్లకల్లును ధ్వంసం చేశారు. గ్రామంలో తెల్లకల్లు విక్రయిస్తున్న గంగేశ్వర్ పరమేశ్వర్‌పై కేసు నమోదు చేశారు. అ నంతరం తెల్లకల్లు దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై విజయేందర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా కల్తీకల్లు విక్రయిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు 'ఉపకార'ం

- దరఖాస్తులు కోరుతున్న కేంద్రం
- గరిష్టంగా రూ.25 వేలు అందజేత
- ఉమ్మడి జిల్లాలో పలువురు విద్యార్థులకు ప్రయోజనం


బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	బీడీ కార్మికులు
నిర్మల్	70,000
ఆదిలాబాద్	3,000
కుమురంభీం	1,500
మంచిర్యాల	700
మొత్తం	75,200

ఉపకార వేతనం (రూ.ల్లో)

తరగతి	స్కాలర్‌షిప్
1 నుంచి 4	1,000
5 నుంచి 8	1,500
9 నుంచి 10	2,000
ఇంటర్	3,000
డిగ్రీ, పాలిటెక్నిక్, ఇతర వృత్తి విద్యాకోర్సులు	6,000
ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంబీబీఎస్, బీఏఎంఎస్	25,000

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌చైన్‌గేట్: బీడీ కార్మికుల పిల్లలు చదువులో రాణించేలా కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ చేయూతనిస్తోంది. ఒకటో తరగతి నుంచి ఎంబీఏ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల వరకు అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ సంవత్సరం ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. కనిష్టంగా రూ.వెయ్యి, గరిష్టంగా రూ.25 వేలు అందజేస్తూ వారి ఉన్నత విద్యకు బాటలు వేస్తోంది. 2025–2026 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఉమ్మడి జిల్లాలో పీఎఫ్ కలిగిన బీడీ కార్మికులు 75,200 మంది ఉన్నారు. ఆయా కుటుంబాలకు చెందిన విద్యార్థులు సుమారు లక్షా 20 వేల మంది వివిధ స్థాయిల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వారంతా పథకం కింద దరఖాస్తు చేసుకుంటే లబ్ధి పొందనున్నారు.

అర్హతలు
- పదోతరగతి, ఇంటర్‌లో నేరుగా ఉత్తీర్ణులై ఉండాలి.
- సప్లిమెంటరీ విద్యార్థులు అనర్హులు.
- దూరవిద్య అభ్యసించిన వారు అనర్హులు.
- తండ్రి లేదా తల్లికి పీఎఫ్ గుర్తింపు కార్డు తప్పనిసరి.
- కుటుంబ ఆదాయం నెలకు రూ.10వేల లోపు ఉండాలి.

జత చేయాల్సిన పత్రాలు
- 2025లో తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం.
- విద్యార్థి పేరిట బ్యాంక్ ఖాతా
- గత సంవత్సరం చదివిన తరగతి, కోర్సుకు సంబంధించిన మార్కుల మెమో

దరఖాస్తు గడువు..
అర్హులైన విద్యార్థులు http:// scholarship. gov. in వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలు నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జతపరచాలి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు ఆగస్టు 31లోగా, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, తదితర వృత్తి విద్యా కోర్సులు, ఎంబీఏ, ఎంబీబీఎస్, బీఏఎంఎస్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పూర్తి వివరాలు, సందేహాల నివృత్తికి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ చౌరస్తాలో గల బీడీ కార్మికుల ఆస్పత్రిలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

సద్వినియోగపర్చుకోవాలి

బీడీ కార్మికుల పిల్లలు చదువుకునేందుకు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఏటా ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సందేహాలుంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలి. – డాక్టర్ మహేష్, బీడీ కార్మిక ఆస్పత్రి వైద్యాధికారి, నిర్మల్

అవగాహన లేమి..
బీడీ కార్మికుల పిల్లలకు జాతీయస్థాయిలో ఉపకార వేతన స్కీం ఎప్పటి నుంచో అమలులో ఉంది. అయినా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు, కొన్ని సందర్భాల్లో వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం, దరఖాస్తు అప్‌లోడ్ కాకపోవడం వంటి సమస్యల వల్ల చాలామంది ఉపకార వేతనం పొందలేకపోతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రూ.200 నుంచి రూ.300 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి దరఖాస్తు అప్‌లోడ్ కాకపోతే తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా బీడీ కార్మికుల పిల్లల కోసం కేంద్రం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందన్న విషయం చాలా మందికి ఇప్పటికీ తెలియదు. దీనిపై ప్రచారం కల్పించాలని, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవోదయలో ఆటలపోటీలు

- 23, 24 తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడలు
- రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి క్రీడాకారులు రాక


వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు చదువుతో ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పీఈటీలు విద్యార్థులకు క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇస్తుండడంతో నేషనల్ స్థాయి క్రీడల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో తెలంగాణ రాష్ట్రంలోని నవోదయ విద్యాలయాల క్లస్టర్‌స్థాయి పోటీలు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని కాగజ్‌నగర్‌లో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో జరగనున్నాయి.

జరుగనున్న ఈవెంట్స్
అండర్ 14, 17, 19 విభాగంలో హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారు. ఒక్కో క్రీడలో 6 టీంలుగా 18 జట్లు క్రీడల్లో పాల్గొనున్నాయి. గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 29, 31 తేదీల్లో కేరళలో జరిగే రీజినల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఇందులో తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ జట్లు పాల్గొననున్నాయి.

చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సాహం



విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నాం. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పీఈటీలు క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల క్రితం కరుణాకర్, హరీష్‌నాయక్, నిశ్విత్ రెడ్డి, ప్రిన్స్ యాదవ్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు.
– రేపాల కృష్ణ, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం, కాగజ్‌నగర్

ఆర్కే 5 గనిలో దొంగల బీభత్సం


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై సంతోశ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఐదుగురు వ్యక్తులు గని ఆవరణలోని గోడదూకి స్క్రాప్, కాపర్ కేబుల్ ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. గమనించిన సెక్యూరిటీ గార్డు పూర్ణ వెంకటేశ్ విజిల్ వేసి ఇతర సిబ్బందిని అలర్ట్ చేశాడు. సెక్యూరిటీ సిబ్బంది అలికిరి విని దొంగలు చీకట్లో దాక్కున్నారు. వెంకటేశ్ వారి వద్దకు వెళ్లడంతో అతనిపై దాడికి పాల్పడ్డారు. మిగతా సెక్యూరిటీ గార్డులు వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా రాళ్లతో దాడి చేశారు. దీంతో మధుకర్, కుమార్‌కు గాయాలయ్యాయి. ఇంతలో ఎస్‌సీటీఎస్ టీం సభ్యులు రావడంతో అందరూ కలిసి చాకచక్యంగా ముగ్గుర్ని పట్టుకోగా ఇద్దరు పరారయ్యారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డికి సమాచారం అందించగా ఆయన శ్రీరాంపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు తక్షణమే స్పందించి కొద్ది గంటల్లోనే మిగతా ఇద్దరిని పట్టుకున్నారు. ఈ మేరకు సెక్యూరిటీ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన నరేంద్ర, పవన్‌కుమార్, శివ, మునియప్ప, భూమయ్యపై కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బందిని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి అభినందించారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

తానూరు: మండలంలోని బోంద్రట్‌లో ఈ నెల 13న పట్టపగలు గ్రామానికి చెందిన జగ్గే సవిత్రిబాయి, నారాయణ్ దంపతుల ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె రాహుల్ ఇంట్లో ఎవరూలేని సమయంలో చొరబడి రూ.70 నగదు, పదమూడున్నర గ్రాముల బంగారు ఆభరణాలు, 10 గ్రాముల వెండి దొంగిలించాడు. బోంద్రట్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని హైవే పక్కన పొదలో గుంతతవ్వి అందులో దాచి పెట్టాడు. ఎస్సై షేక్ జుబేర్ నిందితుడిని వేలిముద్రల ఆధారంగా పట్టుకున్నాడు. నిందితుని వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ముధోల్ సీఐ మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన షేక్ అహ్మద్, బంగాలగల్లీకి చెందిన సుల్తాన్ ఖాన్ స్థానిక గాంధీగంజ్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై నవనీత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా 2.5 కిలోల ఎండు గంజాయి లభించినట్లు వెల్లడించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. వీరిద్దరిపై గతంలోనూ గంజాయి అక్రమ రవాణా కేసు నమోదైందన్నారు. సమావేశంలో సీఐ జి గోపీనాథ్, ఎస్సై నవనీత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం!

మంచిర్యాలక్రైం: ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు రాంనగర్‌కు చెందిన సెటిపెల్లి శ్రీనివాస్ వద్ద కలీమ్ ఐదు నెలల క్రితం రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లించడంలో జాప్యం జరగడంతో కాలేజీరోడ్ ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ షఫీ ఇంటికి వచ్చి అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా కుటుంబ సభ్యులను బెదిరించాడు. అంతేకాకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తానని బెదిరించడంతో మనస్తాపానికి గురైన కలీమ్ ఆటోస్టాండ్ వద్ద ఆలౌట్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానిక ఆటో డ్రైవర్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు రాలేదన్నారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య


నందిని (ఫైల్)

తలమడుగు: ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల మేరకు సుంకిడి గ్రామానికి చెందిన గంగాధర నందిని (19) ఆదిలాబాద్‌లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మూడేళ్లుగా మానసిక స్థితి సరిగాలేదు. మంగళవారం ఉదయం స్నానం చేసేందుకు బాత్రూంకు వెళ్లి ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా చున్నీతో ఉరేసుకుని కనిపించింది. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బేలలో యువకుడు..

బేల: మండల కేంద్రంలోని కుమురం భీం కాలనీకి చెందిన కుడిమెత రాంచందర్ (30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాంచందర్ కుటుంబంలో కొన్నిరోజులుగా కలహాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంట్లో భార్య లక్ష్మితో గొడవపడ్డాడు. చనిపోతానని తాడు తీసుకుని బయటకు వెళ్లాడు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఓ చెట్టు కొమ్మకు ఉరేసుకుని కనిపించాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మధుకృష్ణ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

తానూరు: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల మేరకు బామ్ని గ్రామానికి చెందిన కోతిమీర గౌతం (35) కొంతకాలంగా మద్యానికి బానిసై ఏపని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్యలు పుష్పలత, అర్చన, కుమార్తె ఉన్నారు.

లింబగూడలో ఇంటర్ విద్యార్థి..

సిర్పూర్(టి): మండలంలోని లింబగూడలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సుర్పం శేఖర్ (17) సిర్పూర్‌లోని ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి పూర్తి చేశాడు. ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆశ్రమ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో జాయిన్ అయ్యాడు. ఈ నెల 11న ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లాలని చెప్పగా పోనని ఇంటివద్దే ఉన్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి సుర్పం యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణాలు కాపాడి.. కుటుంబ సభ్యులకు అప్పగించి


శ్రీనివాస్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సిబ్బంది

లోకేశ్వరం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని బ్లూకోల్ట్ సిబ్బంది కాపాడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన పుసవర్ల శ్రీనివాస్ మంగళవారం పంచగుడి వంతెన వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నానని 100కు డయల్ చేసి సమాచారం అందించాడు. వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది సబ్దర్ హుస్సేన్, ధన్‌రాజ్ అక్కడికి చేరుకుని అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధితుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈక్రమంలో మద్యానికి బానిసై ఆత్మహత్యకు యత్నించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గంజాయి కేసు నమోదు

నెన్నెల: గంజాయి సేవిస్తున్న యువకుడిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. జెండావెంకటాపూర్ గ్రామ శివారు మామిడి తోటలో గంజాయి సేవిస్తున్నాడని తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఎస్కూరి శశికుమార్‌ను దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించాయన్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి రాకేష్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సెల్‌ఫోన్ పేలి యువకుడికి గాయాలు


పేలిన సెల్‌ఫోన్


గాయాల పాలైన యువకుడు

భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పలకోటి గ్రామానికి చెందిన గంగాధర్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ మంగళవారం అకస్మాత్తుగా పేలడంతో స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గంగాధర్ మహారాష్ట్రలోని బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తున్న క్రమంలో భోరజ్ హైవే వద్ద సెల్‌ఫోన్ ఒక్కసారిగా పేలింది. దీంతో స్వల్ప గాయాల పాలైన ఆయనను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

'కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి'


పోస్ట్‌కార్డులను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టినట్లు ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ అన్నారు. జూన్ 23న చేపట్టిన చైతన్యయాత్ర మంగళవారం ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1921లో ఇంపీరియల్ బ్యాంక్ కుప్పకూలినప్పుడు 'రూపాయి దాని సమస్య పరిష్కర మార్గం' అనే అంశంపై పుస్తకాన్ని రాసి హిల్టన్ యంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్‌కు ఇచ్చారని, దాని ఫలితంగానే 1935 ఏప్రిల్ 1న ఆర్బీఐ ఏర్పడిందని గుర్తు చేశారు. అంబేద్కర్ లేకుంటే ఆర్బీఐనే లేదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి లక్ష మందితో పోస్ట్ కార్డులు రాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సోన్‌కాంబ్లే మనోహర్, వాగ్మరే కామ్‌రాజ్, కాంబ్లే ఉత్తం, బాలాజీ, మస్కే రాజువర్ధన్, పరత్వాగ్ సందీప్, సూర్యవంశీ ఉత్తం, సత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.

బొలెరోను ఢీకొట్టిన కారు

- 8 మందికి గాయాలు


గాయపడిన బొలెరో డ్రైవర్ సంతోష్

రెబ్బెన: మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో సోమవారం రాత్రి జాతీయ రహదారిపై బొలెరోను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇరు వాహనాల్లో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. సిర్పూర్ (టి) రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న సాగర్ సోమవారం విధి నిర్వహణలో భాగంగా పెద్దపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భార్య అరుణ, కుమారులు విశ్వక్‌రాజ్, విహాన్ రాజ్‌లతో కలిసి బొలెరో వాహనంలో బయలుదేరాడు. రెబ్బెన మండల పరిధిలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో రెడిమిక్స్ ప్లాంట్ వద్దకు చేరుకోగా రెబ్బెన వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న షిఫ్ట్‌కారు అతివేగంగా వచ్చి బొలెరోను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న సాగర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు, డ్రైవర్ సంతోష్‌కు, షిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సాగర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులను రెబ్బెన పీహెచ్‌సీ తరలించి ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు. సాగర్ సోదరుడు రజినికాంత్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పస్తులుంటున్నా పట్టించుకుంటలేరు..

- మోదీ గారు ఇండియాకు రప్పించండి
- కువైట్‌లో మండల వాసి నరకయాతన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్


మోదీని వేడుకుంటున్న శాంతయ్య


ప్రభుత్వాన్ని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

జన్నారం: 'ప్రధాని మోదీ సార్ మూడు రోజుల నుంచి తిండి లేదు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన సార్.. పోలీసులు పట్టించుకుంట లేరు. రెండేళ్ల క్రితం కువైట్ పోయిన.. రెండు నెలల నుంచి జీతాలు ఇస్తలేరు.. తిండి లేదు, ఇంటికి పంపడం లేదు.. ఎండలు చాలా కొడుతున్నాయి.. సార్ నన్ను కాపాడండి..' అంటూ మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గొర్రె శాంతయ్య ప్రధానిని వేడుకుంటూ విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శాంతయ్య ఉపాధి కోసం రెండేళ్ల క్రితం కువైట్ దేశం వెళ్లి కూలీగా పని చేస్తున్నాడు. రెండు నెలలుగా యజమాని జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడు. జీతం రాకపోవడంతో తిండికి గోసైతందని, ఇండియాకు పంపివ్వమంటే పాస్‌పోర్టు ఇవ్వడం లేదని తెలిపాడు. ఈ విషయాన్ని అక్కడి పోలీసులకు చెప్పడానికి వెళ్తే మూడు రోజులుగా తిప్పించుకుంటున్నారని, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అబుసుల్తాన్ అనే వ్యక్తి పాస్‌పోర్టు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడని, తన నంబరును బ్లాక్ లిస్టులో పెట్టాడని, రెండు నెలలుగా వేరేచోట పని చేయగా.. వారూ వెళ్లగొట్టారని పేర్కొన్నాడు. ప్రధాని మోదీ, తెలంగాణ ప్రభుత్వం ఇండియాకు రప్పించాలంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.

శాంతయ్యను రప్పించండి: కుటుంబీకులు
శాంతయ్యను ఇండియాకు రప్పించాలని ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని తల్లిదండ్రులు గొర్రె శంకరయ్య, లక్ష్మీ, భార్య ప్రమీల, కుమారుడు సాయితేజ, కూతురు వైష్ణవి వేడుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్నామని, తమ కొడుకు ఏడుస్తూ వేడుకుంటుంటే తట్టుకోలేకపోతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

సైబర్ మోసగాళ్ల వలలో పడవద్దు

చెన్నూర్: ప్రజలు సైబర నేరగాళ్ల వలలో పడవద్దని సీఐ దేవేందర్‌రావు అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన రత్న రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ.50 వేలు పోగొట్టుకోగా చెన్నూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరస్తుని అకౌంట్ నుంచి రూ.16,500లను రత్న రాజేశ్వర్‌రెడ్డికి ట్రాన్స్‌ఫర్ చేయించామన్నారు. మంగళవారం నగదు ట్రాన్స్‌ఫర్ పత్రాన్ని బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరస్తుల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు.